ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	505.60 (124.3222)	53,795	6,112
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.10 (3.80)	1,002	353
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	103.04 (1.04)	69	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240

ప్రాజెక్టులు నిండి కాల్వలకు నీటిని విడుదలచేస్తే వాటి నిర్వహణలో లష్కర్లది కీలక భూమిక. కాల్వల వెంట తిరుగుతూ ఎక్కడ గండిపడినా అధికారులకు సమాచారం ఇవ్వడం, నీటి చౌర్యం జరగకుండా అడ్డుకోవడం వీరి విధి. నీటి విడుదలకు ముందే ఎక్కడెక్కడ కట్టలు బలహీనంగా ఉన్నాయో గుర్తించి అధికారులను వీరు అప్రమత్తం చేస్తుంటారు. ఇంతటి కీలక విధులు నిర్వహించే లష్కర్ల పోస్టుల భర్తీని ప్రభుత్వాలు ఏళ్లుగా పట్టించుకోవడం లేదు. ఫలితంగా నిర్వహణ లేక కాల్వలు బలహీనంగా మారాయి.

- నల్లగొండ



లష్కర్లు ఏరీ?

- చెరువుల పర్యవేక్షణ, నీటి విడుదలకు సిబ్బంది కొరత
- జలాశయాలకు గండిపడితే చూసే వారు కరువు
- పోస్టుల భర్తీపై దృష్టి సారించని అధికారులు
- భారీ వర్షాలు వస్తే జలాశయాలకు పొంచివున్న ముప్పు

కృష్ణానది ఎగువ ప్రాంతాలైన కర్నాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో వరద ప్రభావం మొదలైంది. ప్రవాహం ఇలాగే కొనసాగి నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో పెరిగితే కాల్వలకు నీటి విడుదల చేసే అవకాశం ఉంది. సాగర్ నిండితే ఆయకట్టులోని పలు చెరువులు, కుంటలకు నీటిని విడుదల చేస్తారు. ఏఎమ్మార్పీ కింద ఉన్న చెరువులకు కూడా కృష్ణ జలాలు చేరుతాయి. హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు నీరు చేరడంతో పాటు కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల కూడా చేశారు. డిండి ప్రాజెక్టుకు సైతం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కురిసే వర్షాలతో రానున్న రోజుల్లో వరద వచ్చే అవకాశం ఉంది. గత ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ పథకం కిం ద పలు చెరువలను పునరుద్ధరించారు. దీంతో కొన్ని చెరువులు పటిష్ఠంగా అ యినా, మరికొన్ని చెరువులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో కట్టలు బలహీనంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జూన్ నుంచి నీటి సంవత్సరం మొదలైనా, ఇప్పటి వరకు భారీ వర్షాలు లేకపోవడంతోజలాశయాల్లో నీరు చేరలేదు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే సాగర్ నిండితే చెరువులకు నీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. అయితే చెరువుల పటిష్ఠతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వర్షాలతో వరదలు వస్తే చెరువులకు గండిపడే ముప్పు ఉంది.

ఉమ్మడి జిల్లాలో 3,119 చెరువులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 3,119 చెరువులు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో 1,628, సూర్యాపేట జిల్లాలో 1,224 చెరువులు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 267 చెరువులు ఉన్నాయి. అయితే ఈ మూడు జిల్లాలో లష్కర్ల కొరత తీవ్రంగా ఉంది. చెరువులకు, ప్రాజెక్టులకు వచ్చే

ఎలాంటి సిబ్బంది కొరత లేదు

నీటి పారుదలశాఖలో వర్క్‌చార్జ్‌డ్ సిబ్బందికి సంబంధించి ఎలాంటి కొరత లేదు. గతంలో వీఆర్‌ఏలను వర్క్‌చార్జ్‌డ్ పోస్టింగ్‌లల్లో సర్దుబాటు చేయడంతో ఎలాంటి ఇబ్బంది లేదు. జిల్లాలో ప్రస్తుతం చెరువుల్లో నీటిమట్టం మామూలుగానే ఉంది. సిబ్బంది నిరంతరం పనిచేస్తూ పర్యవేక్షణ చేస్తున్నారు.

- ఎస్.పార్వతీశ్వర్‌రావు, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, నీటి పారుదల శాఖ, నల్లగొండ

క్షేత్ర స్థాయిలో కీలక సిబ్బంది ఏరీ?

కొన్ని చెరువులను మిషన్ కాకతీయ పునరుద్ధరించినప్పటికీ చాలా చెరువులకు కట్టలు పటిష్ఠంగా లేవు. కాల్వల్లో కంపచెట్లు పెరిగినా తొలగించే వారు కరువయ్యారు. తూములు, డిస్ట్రిబ్యూటర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో నీరు సాఫీగా సాగకుండా గండిపడే ప్రమాదాలు ఉన్నాయి. లష్కర్లు, ఫిట్టర్‌లు, గేట్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఎలక్ట్రీషియన్ల కొరత అధికంగా ఉంది. నీటి పారుదల శాఖ పునర్ వ్యవస్థీకరణ అనంతరం చీఫ్ ఇంజనీర్లు, ఎస్ఈలు, ఈఈలు, డీఈలు, ఏఈఈ, ఏఈల వరకు పోస్టులను సర్దుబాటు చేసినా, క్షేత్రస్థాయిలో సిబ్బంది అరకొరగానే ఉన్నారు.ప్రత్యామ్నాయంపై అధికార యంత్రాంగం చొరవ తీసుకోకపోవడంతో రానున్న రోజుల్లో సమస్యలు తీవ్రంగా ఉండనున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఉమ్మడి జిల్లాలో 3,119 చెరువులు ఉండగా వర్క్ చార్జ్‌డ్, ఫిట్టర్‌లు, గేట్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు అంతా కలిపి 450మంది వరకు మాత్రమే ఉన్నట్లు సమాచారం. ఇక మూడు జిల్లాలో హెల్పర్‌లు, లష్కర్లు మొత్తం సుమారు 327 మంది ఉన్నట్లు తెలిసింది. నల్లగొండ జిల్లాలో వర్క్ చార్జ్‌డ్ సిబ్బందితో పాటు ఫిట్టర్‌లు, గేట్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఎలక్ట్రీషియన్లు మొత్తం 214మంది ఉండగా,హెల్పర్లు,లష్కర్లు 127మంది ఉన్నారు.

కొత్త పోస్టుల భర్తీ ఇప్పట్లో అసాధ్యమే!

ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నీటిపారుదలశాఖలో పోస్టుల భర్తీపై దృష్టి సారించలేదు. వివిధ గ్రూపుల పరీక్షల కోసం నోటిఫికేషన్లు జారీ చేసిన తరువాతే ఈ పోస్టులు భర్తీకానున్నాయి. అయితే నోటిఫికేషన్ల జారీ ప్రస్తుతం లేకపోవడంతో ఎప్పుడు భర్తీ చేస్తారనే విషయంలో స్పష్టత లేదు. అయితే ముందుగా నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలోని జలాశయాలకు సంబంధించిన ఖాళీలను పూర్తిగా గుర్తించాల్సిన అవసరం ఉంది. అధికారులు మాత్రం సిబ్బంది కొరత లేదని చెబుతున్నా వాస్తవ పరిస్థితులను చూస్తే ఉమ్మడి జిల్లాలోని చెరువులు, కుంటలపై సిబ్బంది కొరత ఉంది. చాలా చెరువులను సిబ్బంది పర్యవేక్షణ చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. చెరువుల పటిష్ఠత ఎలా విధంగా ఉందనే విషయాన్ని ఇప్పటి వరకు ఉన్నతాధికారులు పరిశీలించారనే దానిపై స్పష్టత లేదు. క్షేత్రస్థాయి సిబ్బంది చెబితేనే చెరువుల పరిస్థితి ఎలా ఉందో తెలుస్తుంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నీటిని దిగువకు విడుదల చేసేందుకు ప్రతీ ప్రాజెక్టు వద్ద నిపుణులైన ఆపరేటర్ల అవసరం ఉంటుంది. సంబంధిత శాఖలో నిపుణులైన ఆపరేటర్ల కొరత ఉండటంతో ప్రైవేట్ ఏజెన్సీలపై ఆధారపడాల్సిన అవసరం ఏర్పడింది. అవుట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న వారిలో ఎంతమందికి నైపుణ్యం ఉంది అనేది గుర్తించడం కష్టంగా మారింది. గత సంవత్సరం కూడా వీఆర్ఏలను లష్కర్లు, ఇతర సహాయకులుగా విధుల్లో చేర్చుకున్నారు. వీరిలో ఎవ్వరికీ సరైన శిక్షణ ఇవ్వలేదు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) ఆధ్వర్యంలో ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వాలన్నా నిబంధన ఉన్నా ఏళ్లుగా ఇది అమలుకు నోచుకోవడం లేదు. ఎవరైనా నిరుద్యోగులకు ఆసక్తి ఉంటే శిక్షణ ఇచ్చి నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో ఆపరేటర్లను నియమించాలని నిపుణులు సూచిస్తున్నారు. నీటి విడుదలకు ఎగువస్థాయి నుంచి ఆయకట్టు వరకు సిబ్బంది అవసరం. వారిలో లష్కర్లే కీలకం. అయినా సిబ్బంది కొరతను తీర్చాలన్నా ఆలోచన అటు ప్రభుత్వానికి ఇటు అధికారులకు కలగడం లేదు.



ఇటీవల సాగర్ నీటి విడుదల చేయడంతో పెద్దవూర మండలంలో పహారా కాస్తున్న పోలీస్, రెవెన్యూ సిబ్బంది (ఫైల్)



సమస్యలే పాఠాలు

విద్యార్థులుంటే ఉపాధ్యాయులు లేరు.. ఉపాధ్యాయులుంటే విద్యార్థులు లేరు

మౌలిక వసతులు కరువై విద్యార్థుల ఇక్కట్లు

ప్రభుత్వ పాఠశాలలు సమస్యలతో కునారిల్లుతున్నాయి. ఓ పక్క మౌలిక వసతులు కరువై విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటుండగా, మరో పక్క విద్యార్థులు ఉన్న చోట ఉపాధ్యాయులు లేక, ఉపాధ్యాయులు ఉన్న చోట విద్యార్థులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యాశాఖలో ఇటీవల పదోన్నతులు, బదిలీలను ప్రభుత్వం నిర్వహించినా పాఠశాలల్లో అవసరమైన చోట ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ కాలేదు.

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో వర్షం వస్తే తరగతి గదుల్లోకి నీరు చేరుతోంది. సుమారు అరడుగు మేర నీరు నిలుస్తోంది. ఇక్కడి చదువుతున్న 500 మంది విద్యార్థులకు కేవలం 10 మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. స్నానపు గదులు కూడా సరిగా లేవు. తిరుమలగిరి మండలంలో విద్యార్థులు ఉన్నా సరిపడా ఉపాధ్యాయులు లేరు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో ఉపాధ్యాయులు ఉన్నా విద్యార్థులు లేరు. డిండి మండలంలో గతంలో 46పాఠశాలలు ఉండగా, ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి 22 పాఠశాలలకు విద్యార్థులు లేకపోవడంతో తాళాలు వేశారు. చిట్యాల మండలం వెలిమినేడు బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇక్కడ విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు ఎదురు చూడాల్సి వస్తోంది. యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం బాబుల్‌నాయక్‌తండాలోని ప్రాథమిక పాఠశాల భవనంలో ఒక తరగతి గదిలో పాఠశాల, మరో గదిలో గ్రామపంచాయతీ కార్యాలయం నిర్వహిస్తున్నారు.

•7లో..



హుజూర్‌నగర్‌లో గురుకుల పాఠశాల పైకప్పు కురుస్తుండటంతో బకెట్ పెట్టిన విద్యార్థినులు (ఫైల్)

చేనేత వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి

కేంద్ర చేనేత, జౌళీశాఖ సహాయమంత్రి పవిత్ర మార్గెరిటా

45 రోజుల పాటు శిక్షణ



వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర చేనేత, జౌళీశాఖ సహాయమంత్రి పవిత్ర మార్గెరిటాతో మాట్లాడుతున్న భూదాన్‌పోచంపల్లిలోని సమర్ధ శిక్షణాకేంద్రం నిర్వాహకులు

భూదాన్‌పోచంపల్లి, జూలై 27 : చేనేత వృత్తిలో సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ ఉపాధిని పెంచుకోవాలని కేంద్ర చేనేత, జౌళీ శాఖ సహాయమంత్రి పవిత్ర మార్గెరిటా అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేనేత, జౌళీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 100 కేంద్రాల్లో 100 శిక్షణాలయాలను శనివారం ప్రారంభించింది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని భూదాన్‌పోచంపల్లి పట్టణంలో డీఎస్ఆర్ వీవ్స్ ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వాహకులు దోర్నాల శేషగిరి, మాస్టర్ ట్రైనర్ బోగ బాలయ్య, ఆటిపాముల మహేందర్‌లతో పాటు శిక్షణ పొందుతున్న కార్మికులనుద్దేశించి మాట్లాడారు. చేనేత వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడంతోపాటు చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాలు, ముద్ర రుణాలు, సాంకేతిక పరికరాలను అందజేయనున్నట్లు తెలిపారు. శిక్షణా కేంద్రాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చిక్క కృష్ణ, వీవర్స్ సర్వీస్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలు కొండపైనేనా!

- కొండకింద నిర్మించిన సముదాయాల సంగతేంటో
- టెండర్లు లేకుండా వర్తకులకే అప్పగించేనా..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తుండగా, రద్దీకి అనుగుణంగా కొండపైనే మరి కొన్ని దుకాణాలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ దుకాణాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులతోపాటు అధికారులు సైతం మొగ్గు చూపుతుండటంతో వాటి కోసం కొండపైనే సూచనప్రాయంగా స్థలాన్ని నిర్ధారించారు. అయితే వైటీడీఏ మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా వీటిని ఇక్కడ ఎలా ఏర్పాటు చేస్తారు? వీటికి టెండర్లు నిర్వహిస్తారా? కొండపైన వర్తకులకే అప్పగిస్తారా? కొండ కింద నిర్మించిన సముదాయాల సంగతేంటి? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్ణయం ఉంటుందని ఆలయ అధికారులు చెబుతున్నారు.

- భువనగిరి అర్బన్



గత ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఆలయం,ఇతర అవసరాలకు మినహా కొండపైన ఎలాంటి నిర్మాణాలు ఉండొద్దని నిర్ణయించింది. ఇతర అవసరాలకు కొండకింద భూసేకరణ చేసి తేప్పోత్సవం, లక్ష్మీపుష్కరిణి, దీక్షపరుల మండపం, కల్యాణ కట్ట, అన్నదాన సత్రం, బస్టాండ్ తదితరాలకు సంబంధించి భవనాలను వైటీడీఏ ఆధ్వర్యంలో నిర్మించింది. వీటితో పాటు ఇక్కడే రూ.13కోట్ల వ్యయంతో 162 దుకాణ సముదాయాలను వర్తకుల కోసమే నిర్మించింది. ఈ నిర్మాణాలు ఇలా ఉండగానే 112మంది వర్తకులు జీవనోపాధి కోసం కోర్టు ద్వారా 2026 సంవత్సరం వరకు స్టే పొంది కొండపైనే 10 దుకాణాల ద్వారా వర్తకం నిర్వహిస్తున్నారు.

విప్ ప్రకటనతో...

కోర్టుస్టేతో కొండపైన వర్తకులు 10 దుకాణాలు నిర్వహిస్తుండగా, అదే సమయంలో మరో 15 దుకాణాలు అందుబాటులోకి రానున్నట్లు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రకటించారు. వైటీడీఏ మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా వీటిని కొండపైన ఏర్పాటు చేస్తారా? అవి కూడా టెండర్లు నిర్వహించకుండా కొండపైన వర్తకులకే కేటాయిస్తారా? పాత ఆచారాల పునరుద్ధరణ పేరుతో కొండపైనే ఏర్పాటు చేస్తే కొండకింద నిర్మించిన దుకాణ సముదాయాలు సంగతేంటి? అసలు నిరుద్యోగులకు కేటాయిస్తారా అనే ప్రశ్నలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని సందేహాల నడుమ కొండపైన కొత్తగా ఏర్పాటు చేయనున్న దుకాణాలు సముదాయాల కోసం అధికారులు స్థలాన్ని సూచనప్రాయంగా గుర్తించినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. బ్రేక్ దర్శనం టికెట్ కౌంటర్ నుంచి పైకి వెళ్లే దారిలో వాహనాల పార్కింగ్ స్థలానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటుకు యోచిస్తున్నారు. అధికారులు కూడా మొగ్గు చూపడంతో కేటాయింపు ఇప్పటికే వర్తకులకేనసే ఆపోహలు ఉన్నాయి. ఇదిలా ఉండగా, ఆలయ పునర్నిర్మాణం సమయం నుంచి ఉపాధి కల్పించాలని స్థానికంగా డిమాండ్ ఉంది. వాటికి అనుగుణంగా దుకాణాలు కేటాయింపులు చేస్తారా? లేదోననే అనుమాలు ఉన్నాయి. కొండపైన వర్తకులకే 15 దుకాణాలు కేటాయిస్తారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. టెండర్లు నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వ విప్‌ను స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే పాత ఆచారాల పునరుద్ధరణ పేరుతో భక్తులకు తీర్థం సమర్పణ, శఠగోపం అందజేయడం, 10 దుకాణాల ఏర్పాటు, కొబ్బరికాయలు కొట్టే స్థలం, డార్మెంటరీ హాల్ తదితరాలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వచ్చాయి. వీటి పేరుతో ఈ 15 దుకాణాలు కూడా కొండపైనే ఏర్పాటు చేస్తారేమోననే అనుమాలు వ్యక్తం అవుతున్నాయి.

భక్తుల రద్దీకి అనుగుణంగా దుకాణాలు



భక్తుల రద్దీకి అనుగుణంగా దుకాణాల ఏర్పాటుకు ప్రతిపాదనలు కమిషనర్‌కు పంపాం. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా దుకాణాలు కేటాయింపు ఉంటుంది. ప్రస్తుతం 10 దుకాణాలకు 2026 సంవత్సరం వరకు కోర్టు స్టే విధించింది. కొత్తగా ఏర్పాటు చేయనున్న 15దుకాణాలు వర్తకులకే కేటాయిస్తారో? టెండర్లు నిర్వహిస్తారో? ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ప్రకటిస్తాం.

- భాస్కర్‌రావు, ఆలయ ఈవో



గ్రామీణ కక్షిదారుల కోసమే కోర్టుల విస్తరణ

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఈవీ వేణుగోపాల్



గుట్ట బార్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్

యాదగిరిగుట్ట రూరల్, జూలై 27 : మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని కక్షిదారులకు అందుబాటులో ఉండటానికి, సకాలంలో కేసులు పరిష్కారానికి కోర్టులను విస్తరిస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి ఈవీ వేణుగోపాల్ అన్నారు. శనివారం యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి మొదటి తరగతి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టును ఆయన ప్రారంభించి, మాట్లాడారు. సత్వర న్యాయంతో పాటు కేసులు వేగంగా పరిష్కారానికి న్యాయస్థానాలను కొత్తగా ఏర్పాటు చేస్తూ వాటికి అనుగుణంగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం 2023లో రాష్ట్ర వ్యాప్తంగా 59 కోర్టులను మంజూరు చేసిందని అందులో భాగంగానే యాదగిరిగుట్టలో కోర్టు ఏర్పాటు జరిగిందన్నారు. అంచెల వారీగా హైకోర్టు, జిల్లా, డివిజన్ వారీగా కోర్టులు వికేంద్రీకణ జరుగడంతో కక్షిదారులకు ఇబ్బందులు తొలగుతున్నాయన్నారు. రాజాపేట, యాదగిరిగుట్ట మండలాలకు సంబంధించిన కేసులు పరిష్కరించడానికి గుట్టలో నూతన కోర్టు ఏర్పాటు జరిగిందని, కోర్టు పరిధిలోకి 1,989 కేసులు వస్తున్నాయన్నారు. కోర్టు నూతన భవన నిర్మాణానికి కావాల్సిన ఐదు ఎకరాల భూమి కేటాయింపు పెండింగ్‌లో ఉందని దానిని త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతు కే జెండగేకు సూచన చేశారు. భవన నిర్మాణం పూర్తయితే అందులో కోర్టుతో పాటుగా అతిథిగృహాలు నిర్మిస్తే న్యాయమూర్తులు బసచేయడానికి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. న్యాయమూర్తులు టీ వినోద్‌కుమార్, కే లక్ష్మణ్, సుజనలు మాట్లాడుతూ పెండింగ్, దీర్ఘకాలిక కేసులు త్వరగా పరిష్కారానికి సమష్టి కృషి అవసరమనానరు. పేదవారికి న్యాయం అందుబాటులో ఉండేలా వారికి న్యాయవ్యవస్థ మీద నమ్మకం పెరిగేలా చేయడం అందరి బాధ్యత అని గుర్తు చేశారు. గుట్టలో కోర్టు ఏర్పాటుకు కృషి చేసిన యాదగిరిగుట్ట బార్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు గుండ్ల స్వామి, సూదగాని శ్రీహరిగౌడ్‌లను వారు అభినందించారు. అనంతరం కోర్టుల బార్ అసోసియేష్ అధ్యక్షులు న్యాయమూర్తిలను సన్మానించారు. అంతకుముందు కోర్టు ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతు కే జెండగే, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు భైరపాక జయాకర్, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, డీసీపీ రాజేష్‌చంద్ర, చౌటుప్పల్, రామన్నపేట, భువనగిరి, ఆలేరు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

గుట్టలో హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్‌ను సన్మానించిన విప్

ప్రెసిడెన్షియల్ అతిథిగృహంలో హైకోర్టు న్యాయమూర్తి ఈవీ వేణుగోపాల్, కే సుజనలను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వారిని పూలమాల శాలువతో సన్మానించారు. ఆయనతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

అంగన్‌వాడీల అప్‌గ్రేడ్ పనులు చేపట్టాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, జూలై 27 : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల అప్‌గ్రేడ్ పనులు చేపట్టాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. అప్‌గ్రేడ్ చేయాల్సిన 200 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం, 50 కేంద్రాల్లో తాగు నీటి పనులు, ఏడు కేంద్రాల్లో ఇతర మరమ్మతుల కోసం రూ.98. 13 లక్షల నిధులు విడుదల చేశామన్నారు. పనుల అంచనాలు త్వర గా పూర్తి చేసి క్షేత్రస్థాయిలో పనులు చేపట్టాలన్నారు. సమావేశం లో మహిళా, శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఈఈ కరుణాకర్, సీడీపీవోలు జ్యోత్స్న, చంద్రకళ, శైలజ, స్వరాజ్యం రమ, సమీర పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, జూలై 27: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. స్వయంభు వులను మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయం భువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను పంచామృతాలతో అభిషేకించి, తులసీదళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శనహోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరు కల్యాణోత్సవం చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు వైభవంగా నిర్వహించారు. ఆలయఖజానాకు వివిధవిభాగాల ద్వారా రూ.19,79,989 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, పుదుచ్చేరి హోంమంత్రి తిరు ఏ.నమశ్శివాయన్ దంపతులు స్వామి వారిని దర్శించుకు న్నారు. వారికి ఈవో భాస్కర్‌రావు శేషవస్త్రాన్ని కప్పి స్వామివారి చిత్రప టంతో పాటు లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

యాదగిరీశుడిని దర్శించుకున్న న్యాయమూర్తులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని హైకోర్టు న్యాయమూర్తులు ఈవీ. వేణుగోపాల్, టీ.వినోద్‌కుమార్, లక్ష్మణ్, కే.సుజన శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. న్యాయమూర్తులకు వేద పండితులు వేదాశీ ర్వచనం చేయగా, స్వామివారి చిత్రపటాన్ని, లడ్డు ప్రసాదాన్ని ఆలయ ఈవో భాస్కర్‌రావు అందజేశారు. అదేవిధంగా తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కులాల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సైతం స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అంతకుముందు కొండపైన ఆయనకు ఎస్సీ సంక్షేమ జిల్లా అధికారి జినుకల శ్యాంసుందర్, ఎస్సీ కులాల అభివృద్ధి అధి కారి ఎం.జయపాల్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆయ నను కలిసినవారిలో డీఆర్డీవో ఎంఏ.కృష్ణణ్ ఉన్నారు.



స్వామి వారి నిత్యకల్యాణోత్సవం, హైకోర్టు న్యాయమూర్తులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన ప్రభుత్వ విప్

యాదగిరిగుట్టలో నూతనంగా కోర్టు ప్రారంభోత్సవానికి వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులు ఈవీ.వేణుగోపాల్, కే.సుజనను శనివారం ప్రెసిడెన్షియల్ సూట్‌లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. దేవస్థాన పరిధిలోని తులసీ కాటేజీలోని ఓ భవనంలో జూనియర్ సివిల్, మొదటి శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టును విప్ పరిశీలించారు.

సమస్యలే పాఠాలు


వెలిమినేడు బీసీకాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేక కూర్చున్న ప్రధానోపాధ్యాయురాలు

● విద్యార్థులు లేక పాఠశాలలు వెలవెల ● విద్యార్థులు రాకపోతే ఉపాధ్యాయులు ఎదురు చూపులే ● నానాటికీ తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

ప్రభుత్వ పాఠశాలల్లో ఒకప్పుడు తరగతుల నిండా విద్యార్థులు ఉండే వారు. సెక్షన్‌ల వారీగా విభజించి మరీ ఉపాధ్యాయులు పాఠాలు బోధించే వారు. నేడు ఆ పరిస్థితి లేదు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమ క్రమంగా తగ్గుతోంది. కొన్ని తరగతుల్లో కేవలం ఇద్దరు, ముగ్గురు విద్యార్థులే ఉన్నారంటే అతిశయోక్తి కాదు. వారి కోసం ఉపాధ్యాయులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా పరిస్థితి మారడం లేదు. కొన్ని ప్రభుత్వ పాఠశాలలు ఒక్కొక్కటిగా మాతపడుతున్నాయి.

విద్యార్థులులేక వెలవెల

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో 11జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా 121మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 1,050మంది చదువు తున్నారు. 6వ తరగతి విద్యార్థులు 120 మంది, 7వ తరగతి విద్యార్థులు 218 మంది, 8వ తరగతి విద్యార్థులు 231మంది, 9వ తరగతి విద్యార్థులు 252, 10వ తరగతి విద్యార్థులు 230మంది నమోదైనట్లు మండల విద్యాశాఖ ఎన్‌రోల్‌మెంట్ రికార్డు చెబుతోంది. ఏపీలింగోటం, శాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 25కు మించలేదు. రెండు పాఠశాలల్లో 8మంది చొప్పున అన్ని సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులున్నారు. ఏపీలింగోటం జడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతిలో ఐదుగురు, 9వ తరగతిలో నలుగురు, 8వ తరగతిలో నలుగురు, 7వ తరగతిలో నలుగుగురు, 6వ తరగతిలో ఐదుగురు మాత్రమే విద్యార్థులు ఉన్నారు. శాపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో 6వ తరగతిలో ఏడుగురు, 7వ తరగతిలో ముగ్గురు, 8వ తరగతిలో 8మంది, 9వ తరగతిలో 8మంది, 10వ తరగతిలో ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నారు.



నార్కట్‌పల్లి మండలంలోని ఏపీలింగోటం జడ్పీహెచ్‌ఎస్

విద్యార్థుల కోసం ఉపాధ్యాయుల ఎదురు చూపులు

చిట్యాలరూరల్: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడులోని బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు ఎదురు చూడాల్సి వస్తోంది. పాఠశాలలో రికార్డుల ప్రకారం పాఠశాలకు వలస కార్మికులకు చెందిన వారి పిల్లలు సుమారు 29మందికి పైగా పాఠశాలకు వచ్చేవారు. వారిలో చాలామంది ప్రస్తుతం పాఠశాలకు రావడం లేదు. అక్టోబరు మాసంలో తల్లిదండ్రులు తిరిగి గ్రామానికి వస్తే వారి పిల్లలను పాఠశాలకు పంపిస్తారు. పాఠశాలలో 1వ తరగతిలో విద్యార్థులు లేరు. 2వ తరగతిలో 21మంది, 3వ తరగతిలో ఇద్దరు, 4వ తరగతిలో నలుగురు, 5వ తరగతిలో ఇద్దరు, మొత్తం 29మంది విద్యార్థులు ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. హాజరయ్యేది మాత్రం ఇద్దరు విద్యార్థులే. వారిలో మూడో తరగతికి చెందిన ఓ విద్యార్థిని, ఐదో తరగతికి చెందిన మరో విద్యార్థిని ఉన్నారు. వారు గైర్హాజరైతే ఉపాధ్యాయులే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. లేకుంటే గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలోని ప్రాథమిక పాఠశాలకు బీసీకాలనీకి చెందిన 5వ తరగతి వరకు చదువుతున్న సుమారు 20మంది విద్యార్థులు జెడ్పీహెచ్‌ఎస్‌కు వెళ్తున్నారు. జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లే బీసీ కాలనీకి చెందిన విద్యార్థులను అదే కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు బదలాయిస్తే పాఠశాల పురోగతితో పాటు విద్యార్థులతో కళకళలాడుతుంది. పాఠశాల కూడా మూతపడే ఆస్కారం ఉండదు. బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉండడంతో ఒక ఉపాధ్యాయురాలిని మండలంలోని సుంంకెనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపించారు.

మూత పడుతున్న ప్రభుత్వ పాఠశాలలు

డిండి: మండలంలో గతంలో 46పాఠశాలలు ఉండగా, ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి 22 పాఠశాలలకు విద్యార్థులు లేకపోవడంతో తాళాలు వేశారు. ఇందులో కొన్ని పాఠశాలలు గతంలో మూతపడగా మరికొన్ని ఇటీవల మూతపడ్డాయి. ఈ విద్యాసంవత్సరం కొత్తతండా, బొగ్గులదొన ప్రాథమిక పాఠశాలల తోపాటు ఖానాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలు మూతపడింది. బొగ్గులదొన పాఠ శాలలో గత విద్యాసంవత్సరం 30మంది విద్యార్థులు ఉండగా ఈ సంవత్సరం పాఠశాల మూతపడింది. అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు వంతులవారిగా రావడం, సమయపాలన పాటించకపోవడం, విద్యా ప్రమాణాలు పడిపోవడంతో పాఠశాలకు తాళం పడింది. మండలంలోని ఆకుతోటపల్లి ప్రాథమిక పాఠశాలలో మంది విద్యార్థులు, రుద్రాయిగూడెం ప్రాథమిక పాఠశాలలో 8మంది విద్యార్థులు ఉన్నట్లు ఉపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ చూపుతున్నారు. ఉన్నత పాఠశాలలలో టి.గౌరారంలో 5 తరగతులకుగాను 45మంది విద్యార్థులు, కామేపల్లి ఉన్నత పాఠశాలలో 55మంది విద్యార్థులు ఉన్నట్లు ఎన్‌రోల్‌మెంట్ నమోదై ఉంది. ఒక తరగతిలో 1 నిష్పత్తి 40 ఉండాల్సిన విద్యార్థుల సంఖ్య ఐదు తరగతులు కలిపి 45కు తగ్గింది. క్రమంగా ఉన్నత పాఠశాలకు కూడ మూతపడే ప్రమాదముంది. ఏళ్ల తరబడి మండల విద్యాధికారుల నియామకం చేపట్టకపోవడంతో ఒక ఎంఈవో మూడు మండలాలలోని పాఠశాలలను పర్యవేక్షించాల్సి వస్తోంది.

బదిలీపై వెళ్లిన 33మంది ఉపాధ్యాయులు

ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ చేపట్టడంతో ఆ ప్రభావం మారుమూల పాఠశాలలపై పడింది. మండలంలోని 24ప్రాథమిక పాఠశాలల పరిధిలో 33 మంది ఉపాధ్యాయులు ఈ విద్యాసంవత్సరం బదిలీపై వెళ్లగా ముగ్గురు మాత్రమే ఇతర ప్రాంతాల నుంచి విధుల్లో చేరారు. కొందరికి బదిలీ అయినా విద్యాశాఖ వారిని రిలీవ్ చేయలేదు.



తల్లిదండ్రులు వలస వెళ్లడంతో విద్యార్థుల సంఖ్య తగ్గింది

తల్లిదండ్రులు వలస వెళ్లడం వల్ల వారి పిల్లలను కూడా వెంట తీసుకొని వెళ్లారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. అక్కడి ఉపాధ్యాయులను ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేశాం. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపడతాం.

● సామ్యనాయక్, ఎంఈవో.

పాఠాలు.. పంచాయితీలూ ఇక్కడే

తుర్కపల్లి: యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం బాబుల్‌నాయక్‌తండాలోని ప్రాథమిక పాఠశాల భవనంలో పక్క పక్కనే రెండు తరగతి గదులు ఉన్నాయి. పాఠశాలలో 26మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఒక తరగతి గదిలో పాఠశాల, మరో గదిలో గ్రామపంచాయతీ కార్యాలయం నిర్వహిస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదు తరగతులకు కలిపి ఒకే గది ఉండడంతో ఒకటి, రెండు తరగతుల విద్యార్థులను వరండాలో, మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను తరగతి గదిలో కూర్చొబెట్టి పాఠాలు బోధించాల్సిన పరిస్థితి. వర్షం వచ్చినప్పుడు జల్లులు విద్యార్థులపై పడుతున్నప్పుడు వరండాలో ఉన్న విద్యార్థులను కూడా తరగతి గదిలోనే ఉంచి అక్కడే పాఠాలు చెప్పాల్సి వస్తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

గోడలపై వేసిన పేయింట్స్ వృథా

విద్యార్థులకు సులభమైన పద్ధతిలో పాఠాలు బోధించేందుకు రూ.10వేలతో ఓ తరగతి గదిలోని గోడలపై తెలుగు, ఆంగ్ల వర్ణమాల, గుణింతాలు, నంబర్స్ చార్ట్స్ వంటివి పేయింట్ వేయించారు. ఆ తరగతి గదిని గ్రామపంచాయతీ నిర్వహణకు ఉపయోగిస్తుండడంతో అక్కడ విద్యార్థులు కూర్చునేందుకు వీలు లేకపోవడంతో పేయింట్స్ విద్యార్థులకు ఉపయోగపడడం లేదని ఉపాధ్యా యులు తెలిపారు. మరోవైపు ఈ పాఠశాల ఆవరణలో ఉన్న మధ్యాహ్న భోజన వంటగదిలో పది సంవత్సరాలుగా అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తు న్నారు. మధ్యాహ్న భోజనం ఆరు బయటే వంటలు చేయాల్సి వస్తోంది.

అంతా గందరగోళం

తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటుచేయడంతో బాబుల్‌నాయక్‌తండా గ్రామపంచాయతీగా ఏర్పడింది. గ్రామపంచాయతీ కార్యాలయ నిర్వహణకు భవనం లేక పోవడంతో గ్రామస్థుల సూచన మేరకు ఐదుసంవత్సరాల నుంచి పాఠశాల భవనంలో ఓ గదిని కేటాయించారు. గ్రామసభలు, పింఛన్ల పంపిణీ, ప్రతినెలా వైద్య శిబిరం, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో విద్యార్థులకు పాఠాలు బోధించడం కష్టంగా మారింది. గ్రామంలో జరిగే పంచాయితీలు కూడా ఇక్కడే నిర్వహిస్తుండడంతో అంతా గందరగోళంగా మారుతోంది. విద్యార్థులకు సరిపోను తరగతి గదులు నిర్మించి, గ్రామపంచాయతీ కార్యాలయాన్ని వేరే చోట ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రెండు గదులు.. పాఠశాల తరగతి గది, పక్కనే గ్రామపంచాయతీ కార్యాలయం

గురుకుల పాఠశాలలో అస్తవ్యస్తం

హుజూర్‌నగర్: పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల అస్తవ్యస్తంగా ఉండగా, విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ఐదు నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థినులు సుమారు 500 మంది వసతి పొందుతున్నారు. గురుకుల పాఠశాల భవనంలోని పైఅంతస్తులో రేకుల షెడ్డు ఉంది. మూడో అంతస్తులో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం తరగతులు నిర్వహిస్తున్నారు. సుమారు వందమందికి పైగా ఇంటర్‌లో విద్యార్థినులు ఉండగా, ఆరు గదులే ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తరగతి గదులు మొత్తం కురవగా, ఆరు గదుల్లో గోడల వెంట నీళ్లు కారడంతో పాటు రేకులకు మేకులు బిగించిన చోట పెద్ద మొత్తంలో నీరు కారి సుమారు అరడుగు మేర నిలిచింది. రాత్రిపూట నిద్రించే గదులు సైతం కురుస్తున్నాయి. 500 మందికి కేవలం 10 మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. స్నానపు గదులు కూడా సక్రమంగా లేవు. రెండు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలులకు మూడో అంతస్తులో ఉన్న రేకులు లేచిపోయాయి. పదిరోజుల క్రితం వర్షం కురిసే సమయంలో ఆర్డీవో శ్రీనివాసులు ఈ పాఠశాలను పరిశీలించి భవన మరమ్మతులు చేసి విద్యార్థులకు సమస్య లేకుండా చూడాలని యజమానికి చెప్పినా స్పందించడం లేదని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.


గురుకులంలో ఊడిపోయిన సీలింగ్

టీచర్లు లేని చదువెలా

తిరుమలగిరిరూరల్: మండలంలోని తాటిపాముల, తొండ, వెలిశాల, జలాల్‌పురం, గుండెపురి, తిరుమలగిరి గ్రామాల్లో ఉన్నత పాఠశాలలు ఉండగా, 973 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. తాటిపాముల, తొండ, తిరుమలగిరి ఉన్నత పాఠశాలలో మాత్రమే అన్ని సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు ఉన్నారు. గుండెపురి, జలాల్‌పురం, వెలిశాల పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో చదువెలా అని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గుండెపురి ఉన్నత పాఠశాలలో సోషల్, ఇంగ్లీష్, తెలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హిందీ, బయోసైన్స్, పీఈటీ పోస్టులు ఇక్కడ లేవు. వెలిశాల ఉన్నత పాఠశాలలో గణితం, సోషల్ పోస్టులు, జలాల్‌పురం ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్, బయోసైన్స్, సోషల్, హిందీ, పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికైనా ఖాళీలను భర్తీ చేసి విద్యార్థుల భవిష్యత్ కాపాడాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేక హరీష్ వాఖ్యలు : విప్ బీర్ల అయిలయ్య

భువనగిరి అర్బన్, జూలై 27: కాంగ్రెస్ పాలనకు ప్రజాదరణ చూసి ఓర్వలేక మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శనివారం శాసనసభలో హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలు విప్ కౌంటర్ ఇచ్చారు. ప్రజాకర్షక బడ్జెట్ ప్రవేశపెట్టగా రాష్ట్ర ప్రజానికాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన వాగ్దానాలను విస్మరించి కాంగ్రెస్ ప్రజాపాలనపై విరుచుకుపడటం సిగ్గుచేటన్నారు. దళితుడిని ముఖ్యమంత్రి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రుణమాఫీ, దళితులకు మూడెకరాల భూమి వంటి పథకాలు బీఆర్ఎస్ హయాంలో అమలు కాలేదన్నారు. ప్రజాపాలనలో ఆరు గ్యారెంటీలు అమలు చేయడాన్ని జీర్ణించుకోలేక తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.


అసెంబ్లీలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

వ్యవసాయంపై మంత్రులకు అవగాహనేలేదు: మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రులకు సాగునీరు, వ్యవసాయంపై అవగాహనలేదని, కాళేశ్వరంపై బీజేపీతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏ పేరుతో నాటకాలాడుతోందని మాజీమంత్రి జగదీష్‌రెడ్డి ఆరోపించారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ కృష్ణా, గోదావరి నదులు ఆంధ్రా కోసమే పుట్టినట్లు గత పాలకులు వ్యవహరించారన్నారు. నీళ్ల ఎలా లిఫ్ట్‌చేయాలో తెలిసే కేసీఆర్ కన్నెపల్లివద్ద పంప్‌హౌస్ నిర్మించారని, మేడిగడ్డకు ఏదో జరిగిందని ఇప్పటి వరకు చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు మేడిగడ్డవద్ద 10లక్షల క్యూసెక్కుల నీళ్ల వృథాగా పోతున్నాయని చెబుతోందన్నారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, సింగూరు ప్రాజెక్టులు నీళ్లలేక ఎండిపోతున్నాయని, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల్లో రైతులు నీళ్ల కోసం ఎదురుచూస్తున్నారని జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు.

ఉద్యోగ క్రమబద్ధీకరణ చేయాలి: సాంస్కృతిక సారథి సభ్యులు

వలిగొండ, జూలై 27: రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలంగాణ సంస్కృతిక కళాకారుల సారథి శనివారం వినతిపత్రం అందజేశారు. నాలుగు నెలల నుంచి జీతాలు రావడం లేదని ఉద్యోగ క్రమబద్ధీకరణ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. తమ కళాకారుల సమస్యలను సీఎంతో చర్చించి తమకు న్యాయం చేయాలని కళాకారులు కోరారు. కళాకారుల బృందం నాయకులు అంజనేయులు పాల్గొన్నారు.

రైల్వేప్లాట్‌ఫాంపై జాతీయపక్షి నెమలి కళేబరం

ఆలేరు రూరల్, జూలై 27: యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులోని రైల్వే ప్లాట్‌ఫాంపై మృతి చెంది ఉన్న జాతీయపక్షి నెమలిని రైల్వే సిబ్బంది శనివారం గుర్తించారు. 2వ ప్లాట్‌ఫాంపైకి నెమలి ఎలా వచ్చిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గుర్తు తెలియని రైలు ప్రయాణికుడు రైలు నుంచి పడవేసి ఉంటారని భావిస్తున్నారు. అటవీశాఖ అధికారులకు విషయం తెలియజేసినా వారు ఆలస్యంగా స్పందించినట్టు తెలిసింది. చివరికి రైల్వేస్టేషన్‌కు వచ్చిన అటవీశాఖ అధికారులు నెమలి మృతదేహాన్ని తీసుకెళ్లారని రైల్వే పోలీసులు తెలిపారు. కాగా, పోస్టుమార్టం అనంతరం ఆలేరులో ఆ నెమలిని దహనం చేసినట్లు ఫారెస్ట్ అధికారి నిఖిత తెలిపారు.

నెమలిపై కోతుల దాడి

భువనగిరి టౌన్, జూలై 27 : భువనగిరి పట్టణంలోని కిసాన్‌నగర్ పార్కులోకి శనివారం సాయంత్రం నెమలి వచ్చింది. జనావాసాల మధ్య ఉన్న పార్కులోకి వచ్చిన నెమలిపై కోతులు అరుస్తూ దాడి చేస్తుండడంతో తప్పించుకునేందుకు నెమలి పార్కులోకి పరుగులు తీసింది. కోతులు, నెమలి శబ్దాలను విన్న స్థానిక బీఆర్ఎస్ నాయకుడు ఎండీ.అంజద్ వెంటనే అప్రమత్తమై కోతులను పారదోలాడు. అప్పటికే గాయపడిన నెమలిని అటవీ శాఖ కార్యాలయానికి తీసుకువెళ్లి అప్పగించాడు. దీంతో అధికారులు నెమలికి ప్రాథమిక చికిత్స అందించారు. కోలుకున్నాక అడవిలో వదిలిపెడతామని పేర్కొన్నారు.


గాయపడిన నెమలితో అంజద్

లైన్‌మన్‌పై దాడి: కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్, జూలై 27: చౌటుప్పల్ మున్సిపాలిటీ తాళ్లసింగారం లైన్‌మన్ ఎలిజాల శ్రీనివాస్‌పై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు సీఐ ఆశోక్‌రెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లసింగారంలో వీధిలైట్లు ఎందుకు రావడం లేదని ఊదరి నర్సింహ అనే వ్యక్తి శుక్రవారం సాయంత్రం లైన్‌మన్‌కు శ్రీనివాస్‌కు ఫోన్ చేసి ప్రశ్నించారు. అది తమ పరిధి కాదని మునిసిపాలిటీ సిబ్బంది చూసుకుంటారని లైన్‌మన్ తెలిపారు. ఈ విషయంపై ఇద్దరి మధ్య ఫోన్‌లో వాగ్వాదం జరగనుంది. ఈ క్రమంలో సర్వీస్ రోడ్డు ఫేమస్ బేకరి వద్ద ఉన్న లైన్‌మన్ శ్రీనివాస్‌పై నర్సింహతో పాటు అతని అనుచరులు దాడి చేశారు. లైన్‌మన్ ఫిర్యాదు మేరకు నర్సింహతోపాటు అతని అనుచలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కుటుంబకలహాలతో మునిసిపల్ ఉద్యోగి ఆత్మహత్య

యాదగిరిగుట్ట రూరల్, జూలై 27: కుటుంబ కలహాలతో యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మునిసిపల్ ఉద్యోగి బలవన్మరణం చెందాడు. సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకార.. మునిసిపల్ ఉద్యోగి దూడల నర్సింహగౌడ్(54) కుటుంబ కలహాలు భరించలేక శుక్రవారం రాత్రి తన ఇంట్లోని రేకులషెడ్‌లో ఉరి వేసుకున్నాడు. శనివారం తెల్లవారు జామున కుటుంబ సభ్యులు గమనించారు. అప్పటికే నర్సింహగౌడ్ మృత్యువాతపడ్డాడు. నర్సింహగౌడ్ కుమారుడు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా నర్సింహగౌడ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

జవాన్ మహేష్‌కు ఘననివాళి

● భారీగా తరలివచ్చిన ప్రజలు
● మహేష్ అమర్‌హై అంటూ హోరెత్తిన నినాదాలు
● సైనిక లాంఛనాలతో ముగిసిన అంత్యక్రియలు

హాలియా, జూలై 26: దేశరక్షణ కోసం అస్సాంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందిన భారత జవాన్ అగ్నివీర్ ఈరేటి మహేష్ పార్థీవ దేహానికి సైనిక లాంఛనాలతో వేలాదిగా తరలివచ్చిన ప్రజల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. శనివారం ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్‌లోని సైనిక కార్యాలయం నుంచి ప్రత్యేక వాహనంలో మహేష్ పార్థీవాన్ని హాలియా వద్దకు తీసుకువచ్చారు. పట్టణంలో సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతిమయాత్రలో వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు, చుట్టుపక్కల గ్రామాల యువకులు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హాలియా పట్టణంలో ప్రారంభమైన యాత్రకు పెద్దవాగు బ్రిడ్జి వద్ద ప్రజలు స్వాగతం పలికారు. అనంతరం మెయిన్ సెంటర్ వరకు యాత్ర కొనసాగించి ప్రధాన సెంటర్‌లో మహేష్ గౌరవసూచికంగా రెండు నిమిసాలు మౌనం పాటించారు. అనంతరం మహేష్ స్వగ్రామమైన మదారిగూడెంలో సుమారు మూడు కిలోమీటర్ల వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న ప్రజలు మహేష్ అమర్‌హై, జై జవాన్, భారత్‌మాతాకీ జై అనే నినాదాలతో హోరెత్తించారు.

సొంత వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు

మహేష్ స్వగ్రామమైన మదారిగూడెంలోని మహేష్ వ్యవసాయ క్షేత్రంలో పార్థీవ దేహానికి సైనిక, ఎన్‌సీసీ అధికారులు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సైనికుల బృందం వారి సంప్రదాయ పద్ధతిలో గౌరవ సూచికంగా వందనం సమర్పించారు. విలపిస్తున్న మహేష్ తల్లిదండ్రులకు ప్రత్యేకంగా వచ్చిన సైనికాధికారి జాతీయజెండాను అందజేశారు. అంత్యక్రియల సమయంలో గ్రామస్థులు, బంధువులు, చిన్నారులు, మహిళలు, భావోద్వేగానికి గురయ్యారు.


మహేష్ పార్థీవ దేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

అంత్యక్రియలకు తరలివచ్చిన నాయకులు, ప్రముఖులు

అస్సాంలోని దబీర్‌ఘట్ ప్రాంతంలో భద్రత విధుల్లో ఉంటూ అనారోగ్యానికి గురై మృతి చెందిన మహేష్ అంతిమయాత్రంలో నాగార్జునసాగర్ నియోజకవర్గానికి చెందిన పలు పార్టీల నాయకులు, ప్రముఖులు హాజరయ్యారు. ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని మహేష్ పార్థీవానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ సైతం మహేష్‌కు నివాళులర్పించి వారి తల్లితండ్రులను ఓదార్చారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ గౌరవ సలహాదారుడు యడవల్లి నరేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మువ్వా అరుణ్‌కుమార్, బీజేపీ నాయకులు రిక్కల ఇంద్రసేనారెడ్డి, చెన్ను వెంకట్‌నారాయణరెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్, పిల్లి అంజనేయులు, వర్ర వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


హాలియాలో జవాన్ మహేష్ అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు


మహేష్ అంత్యక్రియల్లో పాల్గొన్న సైనికులు

విద్యారంగంపై నిర్లక్ష్యం తగదు : డీటీఎఫ్

నల్లగొండ టౌన్, జూలై 27: విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. సోమయ్య అన్నారు. విద్యారంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ పిలుపు మేరకు నల్లగొండ జిల్లాకేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. 29రాష్ట్రాల్లో కేవలం తెలంగాణలో మాత్రమే విద్యారంగానికి సింగిల్ డిజిట్‌లో నిధులు కేటాయించి చిట్టచివరి రాష్ట్రంగా నిలిచిందన్నారు. డాక్టర్ డీఎస్ కోఠారి వంటి మేధావులు బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని తమ రిపోర్ట్‌లో పేర్కొన్నా విద్యారంగానికి ప్రభుత్వాలు క్రమంగా కేటాయింపులు తగ్గిస్తున్నాయన్నారు. కనీసం 20శాతం నిధులు కేటాయించాలన్నారు. పాఠశాలలన్నింటికీ ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి పాఠశాలకు సర్వీస్ పర్సన్‌లను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యా పరిరక్షణ సమితి గౌరవ అధ్యక్షుడు ఆర్.విజయ్‌కుమార్, పి. వెంకులు, ప్రధాన కార్యదర్శి కె. రత్నయ్య, ఖుర్షీద్‌మియా, పి. ఏడుకొండల్, కాశయ్య, ఆర్. లక్ష్మయ్య, పీడీఎస్‌యూ బాధ్యులు జానీ, ఆనంద్, పీఎల్‌వై ఇందూరి సాగర్, విద్యావంతుల వేదిక బాధ్యుడు పందుల సైదులు ఉన్నారు.


క్లాక్ టవర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న డీటీఎఫ్ నాయకులు

శాపల్లిలో 'అఖండం' ప్రారంభం

● 41 రోజుల పాటు గ్రామంలో దీపంతో ఊరేగింపు

నార్కట్‌పల్లి, జూలై 27: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని శాపల్లిలో ఆషాడంలో నిర్వహించే 'అఖండం' వేడుక శనివారం రాత్రి ప్రారంభమైంది. వందేళ్ల క్రితం పూర్వీకుల నుంచి సంక్రమించిన సాంప్రదాయాన్ని గ్రామస్థులు నేటికీ ఆచారంగా కొనసాగిస్తున్నారు. ఆధునిక వైద్య సౌకర్యం అందుబాటులో లేని సమయంలో అసలు ఏ రోగం వచ్చి మనుషులు చనిపోతున్నారో కూడా తెలియని రోజుల్లో మమ్మల్ని కాపాడమంటూ శాపల్లి గ్రామ పూర్వీకులు గ్రామ దేవతలను పూజిస్తూ ప్రారంభించిన ఉత్సవమే ఈ అఖండం. ప్రతి ఏటా ఆషాడం మాసం సప్తమి తిథిన గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉన్న అఖండ దీపం వెలిగించి ప్రారంభిస్తారు. 41 రోజుల పాటు ప్రతి రోజూ సాయంత్రం గ్రామంలో భజనలు, కోలాటాలతో దీపంతో ఊరేగింపు నిర్వహిస్తారు. కాగా ఈ అఖండ దీపాన్ని పట్టుకునే వ్యక్తి 41రోజుల పాటు నియమ నిష్టతో సాత్విక జీవనం గడపాల్సి ఉంటుంది. 41రోజుల అఖండం పూర్తైన తర్వాత గ్రామంలో కమలాద్రి లక్ష్మీనరసింహుని ఊరేగింపుతో దీపాన్ని తిరిగి ఆలయంలోకి చేర్చడంతో అఖండం వేడుక ముగుస్తుంది.


అఖండ ఉత్సవం నిర్వహిస్తున్న శాపల్లి గ్రామస్థులు

సారా రవాణా చేస్తే చర్యలు

హుజూర్‌నగర్, జూలై 27: సారా అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మానాయక్ అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో సారా కేసుల్లో సీజ్ చేసిన 13 వాహనాలను శనివారం వేలం నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.1,15,000లు అని, కాని ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే 122శాతం అధికంగా రూ.2,56,296లకు 13వాహనాలను అమ్మినట్లు జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మానాయక్ మాట్లాడుతూ సారాకు అవసరమైన ముడి సరుకును రవాణా చేసినా, నిల్వ చేసినా కేసులు తప్పవని హెచ్చరించారు. పలుమార్లు కేసులు నమోదైతే పీడీయాక్ట్ కింద కేసు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ నాగార్జున రెడ్డి, ఎస్ఐ జగన్‌మోహన్ రెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ దారిలో నడిచేది ఎలా..?



పాలడుగులో బురదమయమైన రహదారి

మోత్కూరు, జూలై 27: మండలంలోని పాలడుగు గ్రామంలో పాత గ్రామం నుంచి మెయిన్ రోడ్డుకు శ్మశాన వాటిక ముందు నుంచి వెళ్లే రహదారి కొద్ది పాటి ముసుర్లకే బురదమయమై నడవడానికి వీలు లేని స్థితిలో ఉంది. వాహనాల చక్రాలకు మట్టి చుట్టుకుని ద్విచక్రవాహనాలు ఈ రహదారి పైనుంచి వెళ్ల లేకపోతున్నాయి. మనుషులు కాలినడకన వెళ్లలేని దుస్థితి. సీకేఆర్ ప్రభుత్వంలో జిల్లాలోని గ్రామపంచాయతీలకు ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.25లక్షలు మంజూరు చేసినప్పుడు అందులోంచి ఈ రహదారికి రూ.3.50లక్షలు కెటాయించి రోడ్డు పోశారు. రోడ్డుపై నాణ్యమైన మొరం పోయకుండా సమీపంలో ఉన్న చెరువు మట్టి, చౌడు మట్టి పోయడంతో రోడ్డు ఇలా తయారైందని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు గుదే మధుసూదన్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు కొంపెల్లి గణేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు శేఖర్, అలిందర్, అజయ్, మచ్చగిరి తదితరులు ఆరోపిస్తున్నారు. గ్రామ ప్రజలు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రైతులు ఎక్కువగా ఈ దారి నుంచే వెళతారన్నారు. రోడ్డు బురదమయమై వారు వ్యవసాయ బావుల వద్దకు, ఇతర చోట్లకు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు సందించి రోడ్డుపై బురద లేకుండా మొరం పోసి రహదారి బాగు చేయాలని బీజేపీ నాయకులతో పాటు ప్రజలు కోరుతున్నారు.

ఇక్కత్ డిజైన్ల ప్రింటింగ్‌ను అరికట్టేందుకు కృషి



ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న పద్మశాలి యువజన సంఘం నాయకులు

భూదాన్‌పోచంపల్లి, జూలై 27: పోచంపల్లి చేనేత బ్రాండ్‌గా ఇక్కత్ డిజైన్లకు భౌగోళిక గుర్తింపు (జీఐ) లభించిందని, పోచంపల్లి డిజైన్లను మిల్లు యజమానులు ప్రింట్ చేయకుండా అరికట్టేందుకు కృషి చేస్తానని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. భూదాన్‌పోచంపల్లి పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు గంజి యుగేందర్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు శనివారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యుగేందర్ మాట్లాడుతూ పోచంపల్లి ఇక్కత్ డిజైన్లకు పేటెంట్ హక్కులు కల్పించారని, అయినప్పటికీ బడా పారిశ్రామిక వేత్తలు, మిల్లు యజమానులు యథేచ్ఛగా పోచంపల్లి డిజైన్లను కాపీ చేసి ప్రింటింగ్‌కు పాల్పడుతున్నారని, వారిపై ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుని, పరిశ్రమను పరిరక్షించాలని ఎంపీని కోరారు. అందుకు ఎంపీ సానుకూలంగా స్పందిస్తూ చేనేత పరిరక్షణ కోసం, ఇక్కత్ డిజైన్ల చౌర్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వ పరంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు గంజి యుగేందర్‌తోపాటు ఉపాధ్యక్షులు రుద్ర చంద్రప్రకాష్, ప్రధాన కార్యదర్శి ఆడెపు అరవింద్, గణేష్, నవీన్ పాల్గొన్నారు.

కార్మికుల పక్షాన సీఐటీయూ నిరంతర ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్

రామన్నపేట, జూలై 27: కార్మికుల పక్షాన నిరంతరం ఉద్యమించేది సీఐటీయూ మాత్రమేనని రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. సీఐటీయూ జిల్లా రెండు రోజుల రాజకీయ శిక్షణ తరగతులను ఆయన శనివారం రామన్నపేటలో ప్రారంభించి, మాట్లాడారు. కార్మికుల హక్కులు, సమస్యలు, సంక్షేమం కోసం సీఐటీయూ నిరంతరం పోరాటాలు చేస్తున్నదన్నారు. వర్గ పోరాటాలతో పాటు సామాజిక సమస్యలపై పోరాటం చేస్తేనే దోపిడీ అంతమవుతుందన్నారు. సమాజం దేశాభివృద్ధిలో కార్మికుల శ్రమ కీలకమైందన్నారు. కానీ పాలకులు పెట్టుబడి దారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారన్నారు. పని ప్రదేశాల్లో శ్రామిక మహిళలు వేధింపులకు గురవుతున్నా రక్షణ చర్యలు కరువయ్యాయన్నారు. వివిధ అంశాలపై పలువురు నాయకులు అవగాహన కల్పించారు. ముందుగా జెండా ఎగురవేసి అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దాసరి పాండు కల్లూరి మల్లేశం, నాయకులు తిరుగుడు మల్లిఖార్జున్, మేక అశోక్‌రెడ్డి, దోనూరి నర్సిరెడ్డి, ఎండి పాషా, రమాకుమారి, జెల్లల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం పాల్గొన్నారు.

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

ఆలేరు రూరల్, జూలై 27: శాసన సభా సమావేశాలు జరుగుతున్నందున ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటింపజేయాలని అఖిలపక్ష కమిటీ నాయకులు శనివారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ గేట్ వద్ద ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఆలేరు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానన్నారు. వీరేశం జనార్ధన్ వెంకటేష్, శేఖర్, సలీం, ఉప్పలయ్య, సుదర్శన్ ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయాలు

యాదగిరిగుట్ట రూరల్, జూలై 27: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం బాలంపల్లికి చెందిన కాశపాక రంగయ్య తన బైక్‌పై ఈ నెల 26న మండలంలోని చిన్నకందుకూర్ గ్రామానికి వస్తుండగా చిన్నకందుకూర్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో రంగయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయమై రంగయ్య బావ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మొక్కలు నాటి, సంరక్షించాలి

భువనగిరి టౌన్, జూలై 27: భువనగిరి పట్టణంలోని ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని మునిసిపల్ ఛైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక మీనా నగర్‌లో నిర్వహించిన వన మహోత్సవంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో 2లక్షల మొక్కలు నాటడమే మునిసిపల్ లక్ష్యమన్నారు. ఈ ఉద్యమంలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలన్నారు. మొక్కలు నాటి మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కూర వెంకటేష్, కౌన్సిలర్ కైరంకొండ వెంకటేష్, అనిల్ పాల్గొన్నారు.

వలిగొండ: పర్యావరణాన్ని పరిరక్షించాలని మాంటిస్సోరి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు థామస్ అబ్రహం తెలిపారు. శనివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాంటిస్సోరీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే మనవ మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. సహజవనరులను కాపాడుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జరిన్, మను, పీటర్, రమేష్, జనార్ధన్, శాంద్ర, తేజస్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మానవ వికాసానికి చెట్టే ఆధారమని, ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి కాపాడాలని మండలంలోని కొరటికల్ హైస్కూల్ హెచ్ఎం దడిపెల్లి వెకన్న కోరారు. శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పాఠశాలలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.రవి, శ్రీనివాసాచారి, వరప్రసాద్ పాల్గొన్నారు.

మోటకొండూరు : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం శిక్షా సాప్తహ కార్యక్రమంలో భాగంగా పాఠశాల అవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఎస్ఐ పాండు మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కేతిరెడ్డి రఘురాంరెడ్డి, భైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గంధమల్ల విశ్వరూపం, అచంట భాగ్యశ్రీ, నాతి మల్లేష్, శ్రావన్ కుమార్, భవాని, సుధారాణి, రాజగోపాల్ పాల్గొన్నారు.





మోటకొండూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎస్ఐ పాండు, గుండాల మండలం అంబాల ప్రాథమికోన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

గుండాల: మానవాళి మనుగడకు మొక్కలు కీలకమని ప్రతి ఒక్కరు మొక్కలను సంరక్షించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎలుగు లింగయ్య, పంచాయతీ కార్యదర్శి సైదులు అన్నారు. మండలంలోని అంబాల ప్రాథమికోన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మిషన్ లైఫ్ స్కూల్ న్యూట్రీషన్ డే ఎకో క్లబ్స్‌లో భాగంగా పాఠశాలలో ప్రతి విద్యార్థి తల్లితో కలిసి ఒక మొక్కను నాటారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవేందర్, భాగ్యలక్ష్మీ, అంగన్‌వాడీ ఆయా సునీత, మేట్ శ్రీహరి, మల్లయ్య, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వలిగొండ, జూలై 27: ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితులకు బహిరంగ మార్కెట్ ధర ప్రకారం మూడు రేట్లు పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యులు మాటూరి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం పార్టీ పోరుబాటలో భాగంగా మండల వ్యాప్తంగా నెలకొన్న ప్రజాసమస్యల పరిష్కారంపై ధర్నా చేపడుతుండగా గౌరెల్లి నుంచి భద్రాచలం రహదారి భూనిర్వాసితుల రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరవుతున్న ఆర్డీవో శేఖర్‌రెడ్డిని అడుకుని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ, గౌరెల్లి నుంచి భద్రాచలం త్రిబుల్‌ఆర్ నిర్మాణంలో అనేక మంది పేదలు సన్న, చిన్న కారు రైతుల భూములు కోల్పోతున్నారని వారికి ఇచ్చే పరిహారం రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం ఇవ్వడం సరెంది కాదని అన్నారు. రైతులందరినీ కలిసి సమావేశం ఏర్పాటు చేసేబదులు అధికారులు రెండు, మూడు గ్రామాల రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారిని మోసం చేస్తున్నారని ఆరోపించారు. భూములు కోల్పోతున్న భూనిర్వాసితులందరికీ భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు నిలువునా ముంచే ఈ చర్యలను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు నిర్వాసితుల పక్షాన నిలవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేశం, శ్రీశైలంరెడ్డి రాంచందర్, కిష్టయ్య, వెంకట్‌రెడ్డి చంద్రమౌళి, లింగం, సురేష్, ముత్యాలు, బిక్షపతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో బోనాల సందడి



చౌటుప్పల్‌లో బోనాలతో వెళుతున్న ట్రీనిటీ పాఠశాల విద్యార్థులు



భువనగిరిలోని దేదీప్య పాఠశాలలో బోనాలతో సందడి చేస్తున్న విద్యార్థులు

చౌటుప్పల్ టౌన్, జూలై 27: పట్టణంలోని ట్రీనిటీ విద్యా సంస్థల విద్యార్థులు శనివారం ఎల్లమ్మ తల్లి బోనాల (ఆషాడ బోనాలు) జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. విద్యార్థినులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నాగులకుంట కట్ట మీద ఉన్న ఎల్లమ్మతల్లి ఆలయంలో నైవేద్యంగా సమర్పించారు. ఉత్సవాల్లో ట్రీనిటీ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ మంజుల, చైర్మన్ కృష్ణారావు, సీతారామచంద్రస్వామి దేవాలయం చైర్మన్ బి.మురళి, కౌన్సిలర్‌లు పి.శ్రీధర్ బాబు, కాసర్ల మంజుల, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మండల అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్యారాణి పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: తెలంగాణ సంప్రదాయ బోనాల వేడుకలను భువనగిరిలోని దేదీప్య హైస్కూల్‌లో ఉత్సాహంగా నిర్వహించారు. బాలికలు బోనాలను ఎత్తుకోగా బాలురు పోతరాజులు, శివసత్తుల విన్యాసాలతో అలరించారు. పాఠశాల ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించి గ్రామ దేవతకు నైవేద్యం సమర్పించారు. బోనాల పండుగ విశిష్టతను కరస్పాండెంట్ టి.శేషగిరిరావు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ల టి.రంగారావు, రమ్య, ఉపాధ్యాయులు శంకర్, వేణు, హేమలత, మంజూల, రేఖ, సునీత, నందిత, రవళి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సీట్లను గెలవాలి



రాజాపేట: సమేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్

రాజాపేట, జూలై 27: స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సీట్లను గెలుచుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ కోరారు. శనివారం రాజాపేట మండల కేంద్రంలో మండల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను గ్రామాల్లోని ప్రతి ఇంటికీ ప్రచారం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఊట్కూరి అశోక్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, దాచెపల్లి రాజు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనునాయక్, మాధురిచంద్ర, బాల్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్ విమర్శించారు. శనివారం గుట్టలో బీజేపీ పట్టణ ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేల కొనుగోలుపై ఉన్నశ్రద్ధ ప్రజా పాలనపై లేదని, అతి తక్కువ కాలంలోనే ప్రజల ఆదరణ కోల్పోయిందని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి గుణపాఠం చెప్పకతప్పదని అన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు రచ్చ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, నాయకులు బందారపు మల్లేశంగౌడ్, ఆకుల చంద్రమౌళి, భానుచందర్, బోడ బుచ్చిబాబు, నరేష్, భువగిరి శ్యామ్, తాళ్ల భాస్కర్ రెడ్డి, దొమ్మాట ప్రభాకర్, బొమ్మగాని రాజమణి పాల్గొన్నారు.

విద్యార్థినులు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థినులకు ఆరోగ్య కిట్లను అందజేస్తున్న అధికారులు

సంస్థాన్ నారాయణపురం, జూలై 27: ఆడపిల్లలు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మహిళ సాధికారికత కేంద్రం జిల్లా మిషన్ కోఆర్డినేటర్ హర్ష కోరారు. జిల్లా మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బేటీ బచావో బేటీ పడావో కార్యకలాపాల్లో భాగంగా శనివారం విద్యార్థినులకు క్రీడా వస్తువులు, శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ వివక్ష లేకుండా ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వినియోగించుకోవాలని కోరారు. ఆపద సమయంలో ఉమెన్ హెల్ప్‌లైన్ నెంబర్లు , చైల్డ్‌హెల్ప్ నెంబర్లు 181, 1098 నెంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం జిల్లా మిషన్ సభ్యులు సభ్యులు భార్గవి, మనీషా, సుమలత, పుష్ప, శివరంజిని పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో సబ్‌కోర్టును ఏర్పాటు చేయాలి



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, జూలై 27: చౌటుప్పల్ పట్టణంలో సబ్ కోర్టును ఏర్పాటు చేసి కక్షిదారులకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కోరారు. హైదరాబాద్ లోని సీఎం నివాసంలో శనివారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి చౌటుప్పల్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. సీఎంను కలిసిన వారిలో చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మాజీ ఎంపీపీ తాడూరు వెంకట్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు తాడూరి పరమేష్, ప్రధాన కార్యదర్శి రాపోలు వేణు, కోశాధికారి పి.మహిపాల్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి బాల్యం వెంకటా చలపతి, మాజీ సర్పంచ్ రాజు ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

బొమ్మలరామారం, జూలై 27: మండలంలోని మల్యాల కేజీబీవీలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని అదనపు కలెక్టర్ గంగాధర్ సూచించారు. శనివారం పనులను పరిశీలించారు. ప్రతిపాదిత పనులను త్వరగా పూర్తిచేయాలని, నాణ్యతలో రాజీ పడరాదని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రాజా త్రివిక్రమ్, కేజీబీవి స్పెషల్ ఆఫీసర్ శ్రీలక్ష్మీ, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి

బొమ్మలరామారం, జూలై 27: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడ్య రాజు అన్నారు. ఈ మేరకు శనివారం బొమ్మలరామారంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తెలిపిన నిరసనలో ఆయన మాట్లాడారు. విద్యారంగానికి కేవలం 15శాతం నిధులను మాత్రమే కేటాయించడం విద్యార్థులకు తీరని అన్యాయం చేసినట్లేనన్నారు. అనంతరం తసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జగన్ నాయక్, వెంకటేష్, భరత్, శ్రీకాంత్, వేణు, చరణ్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవే రోటరీ క్లబ్ లక్ష్యం



నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మాజీ గవర్నర్ రాజశేఖర్‌రెడ్డి

భువనగిరి టౌన్, జూలై 27: ప్రజా సేవే రోటరీ క్లబ్ లక్ష్యమని 3150 రోటరీ జిల్లా మాజీ గవర్నర్ తాళ్ల రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం భువనగిరి రోటరీ క్లబ్ ఆఫ్ సెంట్రల్ నూతన కార్యవర్గంతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించి మాట్లాడారు. సేవా తత్పరులు మాత్రమే రోటరీ క్లబ్ సభ్యులుగా కొనసాగగలుగుతారని అన్నారు. సామాజిక సేవలో రోటరీ క్లబ్ సభ్యులు క్రియా శీలకంగా వ్యవహరించాలని సూచించారు. అధ్యక్ష కార్యదర్శులు ఎండి.అనీఫ్ మెమన్, డాక్టర్ పి.సుమంత్‌రెడ్డి, తదితర కార్యవర్గంతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ టి.రంగయ్య, సింగనబోయిన నర్సింహయాదవ్, వెంకట్‌రెడ్డి, ఏళ్ల బుచ్చిరెడ్డి, బాలయ్యయాదవ్ పాల్గొన్నారు.

వైకుంఠ రథం అందజేత



వైకుంఠ రథాన్ని ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరి టౌన్, జూలై 27: భువనగిరి పట్టణం 13వ వార్డు కౌన్సిలర్ జనగాం కవిత నర్సింహాచారి కుమార్తె భావన ఇటీవల మృతి చెందింది. ఆమె స్మారకార్థం రూ.6 లక్షల సొంత నిధులతో తల్లిదండ్రులు వైకుంఠ రథాన్ని రూపొందించి అందుబాటులోకి తెచ్చారు. మృతుల అంత్యక్రియలకు వైకుంఠ రథాన్ని ఉచితంగా సమకూరుస్తామని కౌన్సిలర్ దంపతులు పేర్కొన్నారు. మునిసిపల్ ఛైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీవీ.శ్యాంసుందర్‌రావు వైకుంఠ రథానికి పూజలు చేసి మాట్లాడారు. సమాజ సేవ కోసం లక్షల వ్యయంతో వైకుంఠ రథాన్ని అందించిన కౌన్సిలర్ దంపతులు అభినందనీయులని అన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మాయ దశరథ పాల్గొన్నారు.

10, 11తేదీల్లో ఆవాజ్ రాష్ట్ర శిక్షణ తరగతులు

భువనగిరి టౌన్, జూలై 27: ఆవాజ్ రాష్ట్ర శిక్షణ తరగతులను ఆగస్టు 10, 11వ తేదీల్లో భువనగిరిలో నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన సంఘం అధ్యక్షుడు షేక్ మీరా చౌదరి తెలిపారు. శనివారం భువనగిరిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణా తరగతుల్లో పలు అంశాలపై ప్రముఖులు అవగాహన కల్పిస్తారని, మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. కరపత్రాలను విడుదల చేశారు. ఆహ్వాన సంఘం ప్రతినిధులు ఇక్బాల్, షేక్ అమీద్‌పాషా, ఎస్‌కె లతీఫ్, ఎండి.అఫ్రాన్, ఎండి.జహీద్, ఎండి.జుబేర్ ముక్తార్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

భువనగిరి టౌన్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ (టీఎస్ఈసీ) ఆధ్వర్యంలో శనివారం భువనగిరిలో నిరసన తెలిపారు. నిధులు పెంచి విద్యారంగాన్ని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మైలారం సత్తయ్య, వెంకట్‌రెడ్డి, ఎన్.లక్ష్మీనర్సింహారెడ్డి, లింగారెడ్డి, పి.సత్తయ్య, జి.శ్రీనివాసాచారి, డి.బాలనర్సయ్య పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని బీజేపీ మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో శనివారం భువనగిరిలో ఘన నివాళులు అర్పించారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మైనార్టీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండి.మహమూద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్‌గుప్త, నాయకులు నీలం రమేష్ పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: నిజాయితీకి నిలువుటద్దంగా నిలిచిన అబ్దుల్ కలాం భారత మాత గర్వించదగిన గొప్ప బిడ్డ అని రాఘవ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పులిపలుకుల మహేష్ కొనియాడారు. ఆలేరులో మాజీ రాష్ట్రపతి మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పుట్ట మల్లేష్ ఉన్నారు.

మోత్కూరు : రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేతకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాయకులు సోమరాజు, లక్ష్మీ, లక్ష్మణ్, లక్ష్మమ్మ ఉన్నారు.

ఆత్మకూరు(ఎం) : నియోజకవర్గంలో చిన్న నీటి వనరుల ద్వారా సాగు నీరు అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వట్టిపల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు.

భువనగిరి రూరల్: కల్లుగీత కార్మికుల సంక్షేమానికి నూతన కార్యవర్గ సభ్యులు తమ వంతుగా కృషి చేయాలని భువనగిరి పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి అన్నారు. భువనగిరి మండలం బీయన్‌తిమ్మాపూర్‌లో నూతనంగా గీత కార్మిక సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన దంతూరి వెంకటేశ్ గౌడ్, ఉపాధ్యక్షులు ఎం శివానంద్, ప్రధాన కార్యదర్శి ఎన్ నర్సింహ గౌడ్, డైరెక్టర్ ఈశ్వర్ గౌడ్‌ను అయన సన్మానించారు.

భువనగిరి రూరల్: భువనగిరి మండలం చందుపట్లకు చెందిన మహిళ రైతు చిన్నల మల్లమ్మ(90) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. పీఏసీఎస్ చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.30వేల ఆర్థిక సాయం అందచేశారు.

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ పట్టణంలో సబ్ కోర్టును ఏర్పాటు చేయాలని శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, పట్టణ అధ్యక్షుడు కంచర్ల గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ పి.శ్రీధర్‌బాబు, నాయకులు జి.సురేందర్ రెడ్డి ఉన్నారు.

రామన్నపేట : తెలంగాణ కోసం మంత్రి పదవిని వదిలేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని, ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి తాటిపాముల శేఖర్‌గౌడ్ తెలిపారు. రామన్నపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

భూదాన్‌పోచంపల్లి: కల్లు గీత పారిశ్రామికులను ప్రభుత్వం ఆదుకోవాలని గౌడసంఘం మండల అధ్యక్షుడు గునిగంటి మల్లేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ కట్కూరి మల్లయ్యగౌడ్ మృతి చెందగా వారి కుటుంబానికి సహకార సంఘం ద్వారా రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఆలేరు రూరల్: రైతు రుణమాఫీని ఏకకాలంలో చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొలనుపాకలో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడారు.

ఆలేరు రూరల్: వర్షాకాలంలో ప్రతినిత్యం వర్షాలు పడుతున్నందున పారిశుధ్య కార్మికులకు ఇబ్బంది కాకూడదనే ఉద్దేశంతోనే పారిశుధ్య సిబ్బందికి రెయిన్ కోట్లను పంపిణీ చేశామని మునిసిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, కమిషనర్ లక్ష్మి అన్నారు. శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు రేయిన్ కోట్లను పంపిణీ చేశారు.

రాజాపేట: బీసీ కులగణన చేపట్టి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు జూకంటి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. రాజాపేట మండల కేంద్రంలో గాంధీ చౌరస్తా అఖిల పక్ష ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.